# ★ జిగీష ★

—: రచన: మూలవీసాల వెంకటరామస్వామి బి.ఏ., :—

సంధ్యాసమయం, చల్లని సముద్రపు గాలి, అల్లరిపిల్లల గోవాకలసి నాపై ఎక్కు చక్కని ప్రభావాన్ని చూపెట్టాయి. పొద్దున్న నుండీ హృదయాన్ని కదల్చివేసిన సమస్యా సాగరాన్ని అవి బడబాగ్నిలా ఆర్పివేసాయి. అలా సాగరతీరాన్ని జీవితరథాన్ని నిల్పి ప్రకృతి అందాన్ని తనివిదీరా త్రావవలెనను కున్నా పరిస్థితుల ప్రభావానికి మానవుడు లొంగక తప్పదు. మానవజీవితం సుఖమయ మయిందన్నా, దుఃఖభాజనమయిందన్నా అది పరిస్థితుల ప్రాబల్యంవలెనే అనుకోవాలి. అయితే ఎటువంటి పరిస్థితులలోనైనా తన మార్గాన్నే అనుసరించి, జీవితపథాన్ని చక్కని పరిధిలో నడపగలవాడు నిజంగా ఎంతేనా మహాత్ముడే!........కొత్తనీరువచ్చి పాతనీరును మరుగుపరచినట్టు ప్రస్తుతసమస్యలన్నీ వెనుక బడి, నా గడచిన జీవితపు వింతరంగులతెరలు విడువడ్డాయి.

* * *

నా కళాశాలాధ్యయనం ముగిసింది. నాలుగు సంవత్సరములపాటు పడిన నా కష్ట మంతా ఫలితరూపందాల్చింది. నా పట్టభద్ర పరీక్షలో ఉత్తీర్ణుడనయ్యాను. ఆనాడు నేను పొందిన సంతోషాన్ని నా గత జీవితంలో యెప్పుడూ పొందివుండను. ఇక యెప్పుడూ పొందలేనేమో గూడా! "కృషితో నాస్తి దుర్భిక్షం" అన్నట్లు నా కృషివలన అను కున్నకంటే చక్కని మార్కులే వచ్చాయి. మా కళాశాలలో ప్రథముడుగా పరిగణింప బడ్డాను. ఆ మాట విని నాకన్నా యెక్కువ సంతోషంపొందివుంటారు నా తల్లి తండ్రులు. అయినా "జనులా పుత్రుని గనుగొని పొగ డగ" అన్నట్లు నలుగురు మిత్రులూ కలసి నన్ను పొగుడుతువుంటే వారుపొందిన నూతన నోత్సాహము అనుభవైకవేద్యులకేగాని నాలాటి వారికేం తెలుస్తుంది. నవమాసాలు మోసి, అయిదేళ్లవరకూ వొడిలో కూర్చోపెట్టుకుని ప్రేమతో సాకిన మాతృహృదయం వొక్కసారి తన గారాబుపట్టికి కలిగిన గొప్పతనమును తెలిసికొని చలించి, ద్రవించి, నిర్ఝరగంగామ తల్లిలా వచ్చి నన్ను తాకి శాంతత పొందింది. కాని పితృహృదయంమాత్రం తన సంతోషాన్ని తనలోనే యిముడ్చుకుని తనయునిపై ప్రేమను, అనురాగాన్ని ద్విగుణీకృతంచేసు కొంది. నా హృదయంమాత్రం కొంత తడవు ఆనందాబ్ధిలో జలకమాడి సతత సంతోషార్ణవ ద్వీపభాగాన్ని వాంఛించడం మొదలువెట్టింది. ఉత్తీర్ణుడనయ్యానని తెలిసినదే తడవుగా ఇంత ఆనందాన్ని పొందారుగదా మా తల్లితండ్రులు ఇంకా చదివి వొక కలక్టరుగిరికి వచ్చినప్పుడు వారి ఆనందాలకు హద్దుపద్దులువుంటాయా? జీవితంలో అంతటి స్థానం ఆక్రమించడం అందరివల్లా అవదు. అందరి తలిదండ్రు లకూ తమ కుమారుని ఉత్తమ భవితవ్యం చూచే అవకాశముండదు. దురదృష్టవంతులు తమ కళ్లముందరే తమ తనయుల నికృష్ట జీవన విధానాన్ని చూచి దుఃఖించవలసిన పరిస్థితిని యెదుర్కోవలసివస్తుంది. అట్టి వారికి మరణమే మేలు. మనకాళ్లపై మనము నిలబడేవరకు ప్రేమతో పెంచి పెద్దజేసిన తలి దండ్రుల ఋణము తీర్చుకొనే అవకాశము గలిగినప్పుడు మానవునకు కావలసిన పర మేదియుండును. ఎన్ని కష్టనష్టాలకోర్చియైనా తల్లిదండ్రులకు సంతోషము వారి జీవితాంతం వరకు గూర్చుటయే నా కర్తవ్యము.

నేను వొక సాంసారిక కుటుంబానికిచెందిన వాణ్ణవడంచేత విశ్వవిద్యాలయాధ్యయనం కష్టం. కళాశాలలో విద్యకే యెన్నిమారులో ఫయిన్‌తో నా ఫీజుకట్టాను. "ఉట్టికెగర లేనమ్మ స్వర్గానికేం యెగురుతుంది?" కాలేజీలో చదువుతున్నప్పుడు వొంటరిగా కూచుని నిర్మించిన నా భావిజీవిత ఆకాశ హర్మ్యము లన్నీ వృథా! విద్యాసాధానికిగల మెట్లలో కొన్నింటిని మాత్రమే అధిగమించగలిగాను. మిగిలినమెట్లు నా భావనాదృష్టికి గోచరమైనా వాస్తవికంగా కనుమరుగయ్యాయి. అట్టివాటిని అధిగమించడం నా తరంకాదని తేలింది. ఈ స్థాయికైనా యెట్లాగో చేరగలిగాను. నాతో పాటు 'గుణింతాలు' నేర్చుకొన్నవారిలో చాలా మంది నాకన్నా దిగువనే ఆగిపోయారు. వారి కన్నా నేను నయమనుకుని సంతోషించాలే గాని, ఇన్నాళ్ళు నాతో సమానంగా వచ్చిన సహాధ్యాయులు నన్ను వదలి సంతోషంగా ముందుకి సాగిపోతున్నారంటే ఎంతైనా విచా రించవల్సినా విచారపడకూడదు. కాని విచా రంలోకూడా సంతోషాన్ని ఆస్వాదించగల మానవుడు మానవాతీతుడన్నమాట. అట్టి మానవాతీతునిగా ప్రవర్తింపదలచాను. ఎంతటి ఆనందాన్ని పొందినా, వొకమూల నుంచి విచారం పీక్కుతింటున్నాది. కాని అది సంతోషంతో పోల్చిచూస్తే చాలా తక్కువ. గడచిపోయిన వైభవాన్ని తలచుకు యేడ్చే కంటే, ప్రస్తుత దరిద్రావస్థ గడిచేదెట్లా అని ఆలోచించడం మంచిది. కాబట్టి గడచిన విద్యావస్థను మరచి ఇక ఉద్యోగావస్థలో పడాలి. ఇప్పటివరకూ నాతండ్రిగారు ఎలాగో కష్టనష్టాలకోర్చి, సహనగుణాన్నవలంబించి నన్ను పెంచి పెద్దజేసి చదివించారు. నిజ దారసుతుల పోషణార్థమై కష్టించి డస్సిన నాన్నగారికి విశ్రాంతికూర్చాలి. వారి స్థానాన్ని నే నాక్రమించి వృద్ధమాతాపితరులకు శాంతి సౌఖ్యములను కలిగించాలి.

కళాశాలలో ప్రథమస్థాన మందుకొన్నా.... నలుగురిలో మంచిపేరు సంపాదించుకున్నా, తెలివైన వాడినని యోగ్యతాపత్రాలు పుచ్చు

కొన్నా కలక్టరాఫీసులోనైనా ఉద్యోగం సంపాదించడము కష్టమయిపోతోంది. నాలుగురాళ్లు విసిరితే ఏ వొక్కటైనా తగులకపోతుందా? అనే విశ్వాసంతో కనపడ్డ అన్ని ఖాళీలకు దరఖాస్తులు పంపించాను. ఏది ఎలావున్నా అదృష్టానికి కూడా మన జీవితంలో ప్రమేయం ఉన్నదనే విషయాన్ని ఆమోదించాలి. లేకపోతే నాకన్నా మార్కులు తక్కువవచ్చినా నా సహాధ్యాయులు దర్జాగా ఉద్యోగములు వెలిగిస్తున్నారంటే యెలా? "మనుజుడెల్ల ప్రొద్దుమానక సేయంగా దైవయత్నమొకటి తారసిల్లు" అన్నారు పెద్దలు. ఈ కాలంలో ఉద్యోగాలకు లంచం ముఖ్యం. అలా లంచం యివ్వడానికి నాదగ్గిరేముంది లంచమిచ్చేటంత స్తోమతవుంటే విశ్వవిద్యాలయంలోనే చేరివుందును. ఆలస్యమయినకొద్దీ మంచి ఉద్యోగం వస్తుందని జెప్పి నా మనస్సుకు నచ్చచెప్పుకుని నిశ్చలానందంతో రోజులు గడుపుతున్నాను. నా చెయ్యిచూచిన ప్రతీ జ్యోతిష్కుడూ బాగా చదువుతావు, మంచి ఉద్యోగ మొస్తుంది అని చెపుతూవుంటారు. ఆ మాటలను మననంచేసుకుని (మనస్సులో) అప్పుడప్పుడు నిర్వచనీయమైన ఆనందం పొందుతున్నాను.

తిమిరాకాశానికి చిన్న నక్షత్రోదయమైంది. ఒకనాడు మధ్యాహ్నం నాకు ఉద్యోగమొచ్చిందనే వార్త తపాలాశాఖవారందజేసేరు. ఎలాటి ఉద్యోగమయినాసరే అది సంతోషకరమైనదే! దప్పికతో నోరార్పుకపోతున్నవానికి గుక్కెడు నీళ్లయినా సంతోషాన్నిస్తాయిగదా!....చుట్టూవున్న అంధకారాన్ని తిడుతూ కూచొనేకన్నా చిన్నదీపము, వీలైనంతా చిన్నదీపమైనా వెలిగించి తిమిరాన్ని వారించమన్నారు. మా నాన్నగారి సంపాదనకు నా సంపాదన వేడినీటికి చన్నీటివలె సహకరిస్తుందని యెంచి, మంచి ఉద్యోగం కాకపోయినా, ఆ చిన్న ఉద్యోగంలోనైనా చేరి వీలైనంత ఆనందాన్ననుభవిద్దామని వొక శుభముహూర్తాన ఆఫీసులో అడుగుపెట్టాను. పెద్దల ఆశీర్వచనమూ పిన్నల శుభాకాంక్షలు అందుకుని ఆఫీసుపనికి అలవాటుపడ్డాను. రోజులు మామూలుగా దొర్లుతున్నాయి. జీవితంలో మార్పేమీ గోచరించలేదు. యువకుణ్ణవడంచేతా వేడిరక్తం పొంగులు వారడంచేత అందరికన్నా చురుకుగా నా ఉద్యోగాన్ని నిర్వహిస్తున్నాను. మెత్తనివారినిచూస్తే మొత్తబుద్ధి. అందుచేత పెద్దకస్తులు, కాస్త వయసుమళ్లినవారూ తరచుగా తమపనిగూడా నా తలకే రుద్దేవారు. నేను నిర్వహిస్తున్న సీటు చాలా ముఖ్యమైనది. ప్రజానీకానికి నావలన చాలా అవసరాలుపడుతూవుంటాయి. అందుచేత ప్రతీవారూ వచ్చి నాకెంతో అంత లంచం యిద్దామని చూస్తుండేవారు. కాని అప్పుడే కళాశాలలో రాజకీయశాస్త్రము చదివి, ప్రభుత్వోద్యోగుల ప్రవర్తనలను తీవ్రంగా విమర్శించిన యువకుణ్ణవడంచేతా, సామాన్యప్రజల ఆర్థిక దుస్థితి తెలిసినవాణ్ణవడంచేత నే నటువంటి వేమీ స్వీకరించేవాణ్ణిగాదు. అయితే ప్రభుత్వోద్యోగులు లంచాన్ని యెందుకు తీసుకుంటారనే విషయంమాత్రం యిప్పుడు విశదమవుతోంది. ప్రభుత్వోద్యోగులకొసగే వేతనం చాలా తక్కువ కాని వారికి అయే ఖర్చు లెక్కువ. వేతనం వొక్క భోజనానికే రాదు. అంచేత వారి గౌరవమర్యాదలకు లోటు రాకుండా సంసారాన్ని సరిదిద్దుకోవాలంటే వారికున్నది వొకటేమార్గం .... అదే వక్రమార్గం .... వారు తమ హృదయాన్ని, అంతరాత్మని చంపుకుని వక్రమార్గగాములవుతున్నారు. అట్టిపరిస్థితికి వారు దిగజారిపోయారంటే కారణం వారిపై పరిస్థితుల ప్రభావమే! కాని అట్టిపరిస్థితుల ప్రభావానికి తట్టుకోగల శక్తి నాలోవుండబట్టి నేను లంచం తీసుకో నిర్ణయించుకొలేదు. మంచివారికి తోచిన సహాయంచేసి, చేతగాని పనికి పూనుకొనేవాణ్ణిగాదు.

మంచి మార్గంలో ప్రయాణిస్తున్నవారిని ప్రక్కదారులకు మళ్ళించాలనే చూస్తుంది స్వార్థపూరితప్రపంచం. నా పరిస్థితి గూడా అట్లేఅయింది. నాకు అవసరం లేకపోయినా తమకివ్వడానికేనా లంచం పుచ్చుకోమంటున్నారు తోటి ఉద్యోగస్తులు. కాని నిర్మొగమాటంగా నాకట్టి ఉద్దేశ్యాలు లేవని, వొకరి మాటలు విని నడచుకొనే పద్ధతికాదని విశదీకరించాను. అయినా పదేపదే చెప్పటం మొదలెట్టారు. అట్టిమాటలకొక చెవిటి చెవు వదలివేశాను. కాని పరిస్థితులు విషమరూపం దాలుస్తున్నాయి. నన్ను ఆ సీటునుంచి మార్పిద్దామని ప్రయత్నిస్తున్నారు. ఆ సీటులోనైతే వేగం ప్రమోషనులు పొందడాని కవకాశంవుంది, మిగతాసీట్లలో ఆ భాగ్యం వేగం లభించదు. మా అధికారితో చెప్పి మార్పించాలి. కాని యేమని చెప్తారు. చెప్పేడుమాటలు వింటారా పెద్దఉద్యోగస్తులు. పని బాగాచెయ్యలేదనడానికి వీలులేదు, ఎందుచేతనంటే నేను వచ్చినదగ్గిర్నుంచే పని బాగా సాగుతున్నాదని వొకసారి పొగిడారు నాపై ఉద్యోగస్తులు. పోని మనంమాత్రం మానవమాత్రులంకాదా అందరిలాగే ప్రవర్తిద్దామంటే మనస్సు వొప్పుకోవడం లేదు. నాకు భయపడవలసిన అవసరం యేముంది. తప్పుచేసినవానికి కాని నాకు యేం భయం. నాలో యేం దోషంలేదని ధైర్యంగా హృదయంమీద చెయ్యివేసి చెప్పుకోగలను. నా పక్షాన్ని న్యాయం బలంగావుంది. న్యాయానికి జయం తప్పదు, నిప్పున్నపుల్ల కాలిపోక తప్పదు. నా చుట్టూవున్న పరిస్థితులు చాలా వొత్తిడిని కలుగజేస్తున్నాయి. కాని నా మానసికబలం యీషణ్మాత్రమైనా చలించకుండా చూసుకుంటున్నాను. ప్రతిదినంరాత్రి పడుకోబోయేముందు నా హృదయంలో స్వార్థానికీ, నిజాయితీకి ద్వంద్వయుద్ధమారంభమయ్యేది. 'తన్నుమాలినధర్మము మొదలు చెడ్డబేరము' అనే సూరిగారి వాక్యం గుర్తుకువచ్చినా నేను వెంటనే భారతేతిహాసాదులలో నుండే సంఘటనలు మనస్సున కొచ్చేటప్పటికి సరిదిద్దుకొనేది మనస్సు. ప్రథమంలో అష్టకష్టాలూ అనుభవించినా, చివరకు దుష్టశిక్షణ, శిష్టరక్షణ జరిపి సుఖసౌభాగ్యాలను పొందాడు శ్రీరామచంద్రుడు. పంద్రెండేళ్లరణ్యవాసం, వొక యేడజ్ఞాతవాసంచేసి, శ్రీలీలామానుషుని ప్రజ్వలన కురుక్షేత్రంలో విజయాన్ని పొంది రాజసూయయాగాన్ని నిర్వహించి సమస్తసుఖాలను పొందారు పాండవులు. పవిత్ర భారతదేశాన్ని పరిపాలించిన మహానుభావుల యాశీర్వచన భాగ్యం లభించాలేగాని, నాకు భయమెందుకు. న్యాయమార్గానువర్తికి భయమనవసరం. ఆఖరికి వొక నిర్ణయానికి వచ్చాను. "సాధుసాధు నపూజ్యంతే దుష్టం సర్వత్రపూజయేత్" అన్నారు మహానుభావులు అంచేత ఆ సూత్రాన్నే అనుసరించాను. కాని అంతరాత్మను చంపుకొని, ఆత్మవంచనచేసి అధమాధమమైన లంచగొండితనంలో మాత్రం పడను.

అంత ఆఫీసులోకీ నాకు మిత్రుడు ఒకడే వున్నాడు. అయితే నేం 'పనముత్యమొకటి చాలును' అన్నట్లు అతడు చాలా మంచివాడు. అతడొక్కడేకాదు వారింట్లోవారందరూ అంతే! వాళ్ళు కాస్త ఉన్నవాళ్లే. వాడికొక చెల్లెలు మాత్రంవుంది. చాలా అందంగావుంటుంది. కాలేజీలో చదువుతున్నదట. ఆమెతో మూణ్ణాలుగుసార్లు మాటలాడేను కూడా! ఆమెఅంటే నాకు మనస్సులో తెలియని ఒక వ్యామోహం పుట్టుకొస్తుంది.

ఆఫీసు పరిస్థితు లిట్లుంతగా ఇంటిపరిస్థితులు మరొక లాగున్నాయి. అన్నివిషయాలలోనూ నాకు దైవము వ్యతిరేకమే. నిత్యలంగావున్న కొలనులావున్న మాయింట్లో చిన్నబెడ్డముక్కలా పడింది నా వివాహసమస్య.... బెడ్డ ఎంత పడిపోయింగలదైనా అలలు బయలుదేరకమానవు. వరకట్నపిశాచాపూరిత స్వార్థప్రపంచంలో వివాహసమస్యలు గండరగోళాన్ని సృష్టించటం సబబేగదా! అందుచేత ఒకరికి ఒక అబ్బాయి వున్నాడంటే, ఆ అబ్బాయికి పది పదిహేనేళ్లురా భయం బెల్లంమీద ముసిరే యీగల్లాగ ఆడపిల్లలున్న తల్లిదండ్రులు వారింటిచుట్టూ మూగుతారు. 'కోరి పిల్లనిస్తామంటే — కులం తక్కువ' అనే పూర్వపు నానుడ 'కోరిపిల్లడినిస్తామంటే....' అని మారిపోయింది. పదిహేనేళ్లవాడి పెళ్లి గురించి ఇప్పటినుంచి ప్రాకులాడేపెద్దలు ఇరవయ్యేళ్ల వాణ్ణి నన్ను వొదులుతారా! .... మా యింటికి రోజూ సాయంకాలం యెవరో ఒకరు రావటం నన్నుచూచిపోవటం జరుగుతూన్నది. వివాహవిషయంలో నా అభిమతంవేరు. నే నెప్పటూ చదువుతున్న అమ్మాయినే వివాహంచేసుకోవాలనుకుంటాను. చదువుతున్నవారికి పెంకితనపుపాలు జాస్తియనే కొందరిమాటలు నాకు పడవు, పెంకితనం స్వభావసిద్ధమైనదే గాని విద్యతో యబ్బేదిగాదు. దీపందగ్గర ఒకరు భారత రామాయణాలు పారాయణచేస్తారు, మరియొకరు దొంగదస్తావేజులు తయారు చేస్తారు. అలాగని ఆ గుణదోషాలు దీపానికంటగట్టడం న్యాయమా! వివాహవిషయంలో కన్యను యెంచుకొనడంలో తప్పటడుగు పడిందా దానివల్ల జీవితాంతము బాధపడవలసివస్తుంది. చెడ్డభార్యను చేసుకొనేకంటే వేదాంతుడవటం మంచిది. అందుకే నా వివాహవిషయంలో స్వతంత్రించదలచా.

ఒకరోజున........

"బాబూ! నిన్ను మా కళ్లముందరే ఒక యింటివాణ్ణి చేద్దామని వుందిరా" అన్నది అమ్మ ఆప్యాయంగా!....కాని నేనేమీ సమాధాన మివ్వలేదు.

"ఏం నాయనా అమ్మచెప్పిన విషయాన్ని అంగీకరించటానికి మనసొప్పటం లేదా?" అని ప్రశ్నించారు నాన్నగారు.

"అంగీకారంకాక" అంది అమ్మ ధీమాగా.

"మనమాటతేగాని వాడేం మాట్లాడడు"

"వివాహవిషయంలో నా అభ్యంతరమేమీ లేదు గాని వధువు యెవరో?" అన్నాను నేను.

"మన పక్కవీధిలో వున్నారు గదా.... పచ్చమేడవారి అమ్మాయి....తెల్లగా, సన్నగా, నాజూగ్గా వుంటుంది" అన్నది అమ్మ.

"అవును చూసాను నాలు గైదు సార్లు" అన్నాను.

"నే చెప్పాగా!" ఎలా వుంటుందిరా! అని నాన్న అమ్మలు అన్నారు.

"నీవు చెప్పావు యిప్పుడు....తెల్లగా.... సన్నగా—"

"అది కాదోయ్ .... నీ అభిప్రాయం...." నాన్నగారు.

"అందమైన అమ్మాయి"



"అంత నీకు తెలీకుంటా అవుతుందట్రా వెర్రినాయనా? నీకు నచ్చితే అప్పుడే...." అంది అమ్మ.

"అ నిర్ణయానికేముంది పిల్ల బంగారు బొమ్మ, గుణాలకుప్ప....వాడికి తెలియదా!" అన్నారు నాన్నగారు.

"వాడికేం తెలుసనండీ" అని కసిరింది అమ్మ.

"ఎవరో ఇస్తేకాని తెలుసునో లేదో ఎలా చెప్పటం"

"అయితే నచ్చిందన్నమాట" అంది అమ్మ సరదాగా.

"అందంగా ఉన్నంతమాత్రాన అందరూ నచ్చుతారా అమ్మా" అన్నాను ధైర్యంగా.

"అయితే నీకు నచ్చలేదా!" అంది ఆశ్చర్యంగా. లేదని జవాబిచ్చానునేను "కారణం" అన్నారు నాన్నగారు.

"కారణం అడకగండి...అమ్మా....నాన్నా గారూ నన్ను క్షమించండి! వివాహ విషయంలోమాత్రం నాకు కొంచెం స్వాతంత్ర్య మివ్వాలండి...."

"మంచిచెడ్డ లాలోచించుకొనే మాట్లాడుతున్నావా? నాయనా"....

"అన్నివిషయాలు ఆకళింపుకు చేసుకునే అంటున్నానమ్మా"

"అయితే! నీ వివాహ విషయంలో మా జోక్యమనవసరమా?" అన్నారు నాన్నగారు.

"అలా ఎన్నటికీకాదు నాన్నగారూ! కాని"

"కానీ లేదు....గీనీలేదు"

"నేను చదువుకున్నమ్మాయిని చేసుకుంటా"

"ఓ! ఆ అమ్మాయి చదివింది థర్డుఫారం.

"నేను కళాశాల విద్యాభ్యాసంచేసి నమ్మాయిని చేసుకుంటా"

"నీకు చదువుప్రధానమా? సౌందర్యమా?"

"చదువు సంస్కారం ప్రధానము! అందానికి ప్రాముఖ్యత ఆ తర్వాత వస్తుంది" వారిది సంస్కారకుటుంబమే!

"ఏమయినా గాని....నేను ఒకమ్మాయిని యెంచుకున్నా"

"ఎవరా అమ్మాయి .... పుట్టినదగ్గర్నుంచి నీపై యీగవాలకుండా, ఒళ్ళు కందకుండా గారాబంగా పెంచేము. నీవు పెరిగిపెద్దయి, విద్యార్జనా, విత్తార్జనాజేసి, సంఘంలో గౌరవ స్థానమాక్రమించి మా కానందాన్ని చేకూరుస్తావనుకున్నాం....అయితే మా ఆశలన్నీ అడియాశలన్నమాట" అన్నారు నాన్నగారు.

"అద్దాలలో బిడ్డలుగాని -- గెడ్డాలొచ్చాక బిడ్డలా! రెక్కలు ముక్కలయేలా చేయడమే గాని పెద్దయాక మన మాట వింటారా?" అన్నది అమ్మ గాద్గదికంగా.

"అమ్మా! ఈ ఒక్క విషయంలో మాత్రం" అన్నాను. ఆవేశంగా.

"ఈ విషయమేగాదు అన్ని విషయాలలోను స్వతంత్రించు, పెద్దయేదాకానే గదా మా అవసరం" అన్నది.

అమ్మ దుఃఖపూరితగళంతో....ఇక అక్కడ కూర్చోబుద్ధికాలేదు. అమె అన్న ఆఖరిమాట శూలంలా గుచ్చుకొంది. మాతృహృదయం గాయపడింది నన్నపార్ధంచేసుకుంది. గదిలోకి పోయి కళ్ళుమూసుకున్నాను. పితృవాక్యపరిపాలనార్ధమై, సవతితల్లి కోర్కె తీర్చడానికై, నారవస్త్రధారియై, భూషణరహితుడై, సతీసోదరులతోగలసి, పురజనుల నోదార్చుచూ, మాతాపితరులకు కేలు మోడ్చి, ధవళ మందహాసకాంతులమధ్య అడవికి ప్రయాణమయ్యేటి శ్రీరామచంద్రమూర్తి నాకళ్ళకుగట్టాడు. ఎదురుతిరిగితే ఆతనిని అడ్డేవారులేరు, కాని పితృవాక్యపరిపాలనా దురంధరుడుగదా శ్రీరాముడు. ఇన్నాళ్ళు నన్ను శ్రద్ధతో పెంచిన తల్లితండ్రుల మనస్సుకు గాయాన్ని కలిగించడమెందుకనే భావన జ్యోతిలా మెదలింది మనసులో....దాని పర్యవసానం .... తలిదండ్రుల మోహాన చిరునవ్వు...పందిరిలో పెండ్లి — నా మనస్సులో అవ్యక్తమైనబాధ .... స్నేహితునిసోదరిని నా సోదరిగా భావించి సోదరప్రేమ వెదజల్లడం.

అడుగడుగునా నా జీవితంలో నాకు ప్రతి ఘటనలే .... చదువువిషయంలో .... ఉద్యోగ విషయంలో .... వివాహవిషయంలో .... ప్రతి విషయంలో విధి నాకు ప్రతికూలమే. ఐనా జీవితాన్ని సుఖవంతంచేసుకోడానికి పాటు పడ్డాను. ఎలాగో యిప్పటికటువంటి స్థానాన్ని కష్టపడి....కష్టపడి సంపాదించాను. పట్టుదల వలన సాధించలేనిది లేదు. చెలియలకట్ట దాటుదామని సముద్రుడుచేసే నిత్యప్రయత్నాలు విఫలమైనా అతడుమాత్రం తన జిగిషను వదలకుండానే ప్రయత్నిస్తున్నాడు.... ప్రయత్నిస్తాడు.

* * *

కాళ్ళకు సముద్రపునీరుతగలడంతో భావనా ప్రపంచంనుండి వాస్తవికంలోకి వచ్చాను. అప్పుడే సముద్రప్రాంతమంతా దాదాపు నిర్జనమైంది. ఇందాకటి సౌందర్యంలేదు .... అది మరలా రేపే....వెలుగూ, చీకటీ ప్రపంచానికి మామూలే....అలాగే కష్టసుఖాలు.

అయినా జీవితంలో నిత్యానందాన్ని పొందడానికి మనం చేసే ప్రయత్నాలు ముఖ్యం.... పరాజయాన్ని పొందినా ప్రయత్నం విడువకూడదు. అందుకు మనకు కావలసినది.... జిగీష.

★


## కామధేను

ఇది విలువైన మలయాళ మూలికలతో ప్రాచీనాయుర్వేదపద్ధతిని శాస్త్రీయంగా తయారైన గొప్పమందు. వ్యాధిగ్రస్తులె కాక ఎట్టి వ్యాధిలేనివారుకూడా దీనినిసేవిస్తే దేహాన్ని బలపరచి రసాయనంగా పనిచేయును.

దీనిని స్త్రీ పురుషులు నిరభ్యంతరముగా వాడవచ్చును. మందు మంచి రుచిగావుండును. పథ్యములేదు.

వీర్యనష్టం, ఋతుదోషం, నరముల నిస్సత్తువ, సెగరోగం, మూత్రదోషం మొదలయిన వ్యాధులకు ఈ మందు పెట్టింది పేరు. మూత్రముతోపోవు శుక్లమును, మేహదుర్నీరును, మేహవ్యాధిని, మేహదురదను, మూగతీటను, జననేంద్రియ సంబంధమైన రుగ్మతలను, జననేంద్రియం సన్నబడుట, చిక్కిపోవుట, లేపనశక్తి తగ్గివుండుట, మధుమేహం, నిద్రలేమి, ధాతు దృఢీకరణం లేకుండుట, నరముల నిస్సత్తువ మున్నగు వ్యాధులను ఇది తప్పక కుదుర్చును. మేహకాక, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, కానము మున్నగు బాధలను నివారణచేయును.

ఆకలిలేమి, మలబద్ధకం, నిరుకుట్టు, నడుమునొప్పి, కాళ్లుచేతులు తీట, తెలుపువ్యాధి, తల్తిప్పుట, జ్ఞాపకశక్తి తగ్గుట మొదలైన బాధలను నివారించి బలాన్ని, ఆరోగ్యాన్ని, దేహకాంతిని యిచ్చి యెంతో మేలుచేయును. శీఘ్రంగా ముసలితనం రాకుండా చేస్తుంది.

డబ్బి 1 కి రు. 3=0

ధనలక్ష్మి అండ్ కో., ★ సౌకార్ పేట, మద్రాసు-1.